క్లుప్తంగా

31న వినాయక ఆలయ వార్షికోత్సవం

మునగపాక: స్థానిక సంతబయలు వద్ద గల పురాతన వినాయక ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 31న ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ మందపాటి శ్రీరామ వెంకట నరసింగరావు(రాము) తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు, గణపతి హోమం నిర్వహించనున్నట్టు చెప్పారు.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఎస్.రాయవరం: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి జరగనున్న పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు మండలంలోని పెదగుమ్ములూరు హైస్కూల్‌లో శనివారం నుంచి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు పీఆర్‌టీయూ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. వచ్చేనెల 26 వరకు కోచింగ్ ఇవ్వనున్నట్టు చెప్పారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని పీఆర్‌టీయూ నాయకులు ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. దాతల సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ సమకూరుస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంతం విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు.

ఎన్నికల కోడ్‌పై అప్రమత్తం



సర్వసిద్ధిలో కోడ్ అమలు తీరుపై పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. సర్వసిద్ధి, పేటసూదిపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల కోడ్ అమలు తీరును పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు రాజకీయ నాయకుల చిత్రపటాలు, విగ్రహాలు, శిలాఫలకాలు పూర్తి మూసి వేయాలన్నారు. ముసుగులను ఎవరూ తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు చంద్రకళ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్

పాయకరావుపేట: ఎన్నికల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. సుమారు 80 మంది పాల్మన్‌పేట, రాజయ్యపేట, వెంకటనగరం, రాజానగరం, రాజవరం, గజపతినగరం, అరట్లకోట, పాయకరావుపేట, దుర్గాకాలనీ, ఇందిరాకాలనీ, శెట్టిబలిజ కాలనీ, మెయిన్‌రోడ్డులలో పాయకరావుపేట పోలీస్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాదాల జోలికి వెళ్లొద్దు

ఎస్.రాయవరం: ఎన్నికల సమయంలో వివాదాల జోలికి వెళ్లకుండా సామరస్యంతో మెలగాలని ఎస్ఐ విభీషణరావు అన్నారు. పెదఉప్పలం గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామస్తులతో సమావేశమై ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవలో భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 190వ ఊంజల్ సేవ శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయిల నేతృత్వంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాపారవేత్త కర్రి వీర వెంకట సత్యనారాయణమోహన్ లక్ష్మీలావణ్య దంపతులు కుటుంబ సమేతంగా ఊంజల్ సేవ జరిపారు. శ్రీగౌరీ పరమేశ్వరి అమృతవర్షిణి ప్రతినిధి పెతకంశెట్టి సుజాత పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, సభ్యులు ఆళ్ల మహాలక్ష్మినాయుడు,మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ,భక్తులు పాల్గొన్నారు.

కోణార్క్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాలకు బ్రహ్మరథం



కంబాల జోగులుకు హారతి ఇస్తున్న మత్స్యకారులు



కంబాల జోగులును పరిచయం చేస్తున్న చిక్కాల రామారావు



సమావేశానికి హాజరయిన మత్స్యకారులు

- అడుగడుగునా మత్స్యకారులు నీరాజనాలు
- మా మద్దతు మీకే అంటూ భరోసా

నక్కపల్లి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు కోరడానికి వెళ్లిన పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పాయకరావుపేట ముఖ్యనేతలకు ఒడిశాలోని కోణార్క్‌లో వలస మత్స్యకారులు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా నీరాజనాలు పలికారు. పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. పాయకరావుపేట వర్గంలో పలు మత్స్యకార గ్రామాలనుంచి గంగపుత్రులు వేటకోసం ఒడిశాలోని కోణార్క్ ప్రాంతానికి తాత్కాలికంగా వలస వెళ్లారు. వీరందరూ నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల్లో ఉన్న మత్స్యకార గ్రామాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలతో పాటు, స్థానిక ఎన్నికల్లో వీరంతా ఒడిశాలోని, పూరీ, కోణార్క్, పారాదీప్ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు వలసవెళ్లిన వీరి వద్దకు వెళ్లి మద్దతు కోరడం ఎప్పటి నుంచో వస్తోంది.దీనిలో భాగంగా రెండు రోజుల నుంచి పాయకరావుపేట నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులు వలస మత్స్యకారులను కలిసి మద్దతు కోరుతున్నారు.ఇలా మద్దతు కోరేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అక్కడ మత్స్యకారులు బ్రహ్మరథం పట్టారు. పూలమాలలతో సత్కరించారు. తమ మద్దతు వైఎస్సార్‌సీపీకే అంటూ భరోసా ఇచ్చినట్టు సమన్వయకర్త కంబాల జోగులు తెలిపారు. ఈసందర్భంగా జోగులు స్థానిక మత్స్యకారులనుద్దేశించి మాట్లాడుతూ మత్స్యకారులు కోసం ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. వారికి రాజకీయంగా ఏవిధంగా గుర్తింపునిచ్చిందో తెలిపారు. మత్స్యకారులను, ఇతర బీసీలను చంద్రబాబు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకున్నారన్నారు. మళ్లీ అధికారంలోకి రావడం కోసం బూటకపు హామీలు ఇస్తున్నారని వివరించారు. తెలుగు దేశం కూటమి అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ కొనసాగే పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పార్టీ మండలఅధ్యక్షులు బొలిశెట్టి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి



గ్రామాల్లో ముఖ్యకార్యకర్తలతో సమావేశమైన నాయకులు

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో జరిగిన మేలును మరో సారి ప్రజలకు వివరించి, అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. ఒడ్డిమెట్ట, జగన్నాథపురం, డొంకాడ, రమణయ్యపేట, దోసలపాడు తదితర గ్రామాల్లో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహ మూర్తిల ఆధ్వర్యంలో మండల స్థాయి నేతలు శుక్రవారం పర్యటించారు. ముందుగా ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయంలో స్వామివారిని దర్శనం చేసుకున్నారు.అనంతరం పలు గ్రామాల్లో పర్యటించి ముఖ్యకార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీ చేసే కుట్రలు, దుష్ప్రచారాన్ని ఎదుర్కోవాలని తెలిపారు. వలంటీర్ల వ్యవస్థ, సచివాలయ వ్యవస్థను రద్దుచేస్తామని ఇప్పటికే టీడీపీ నేతలు ప్రకటించారన్నారు. ఆ వ్యవస్థలను రద్దు చేస్తే అవ్వాతాతలకు ఇంటికి తెచ్చి పింఛన్ ఇచ్చే పరిస్థితి ఉండదన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న విద్యావసతి, డ్వాక్రారుణమాఫీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్‌చేయూత వంటి పథకాలన్నింటినీ రద్దు చేస్తారని, మళ్లీ జన్మభూమి కమిటీల పెత్తనం మొదలవుతుందన్నారు. 2014నుంచి 2019 వరకు పడిన ఇబ్బందులను ప్రజలకు వివరించాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు పాపారావు, తాతబాబు, జేసీఎస్ కన్వీనర్ సూరాకాసుల గోవిందు, మాజీ ఎంపీపీ బొల్లంబాబ్జి,సర్పంచ్‌లు వెంకటేష్,భార్గవ్, శ్రీను,వరహాలు, నర్సింహమూర్తి, ఎంపీటీసీలు గోవిందు, రమణ,నాయకులు పెదరాము, నూకన్ననాయుడు, రామకృష్ణ,చంటిరాజు,బాబూరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో చర్యలు



ఎమ్మార్వో సూర్యనారాయణ

పాయకరావుపేట: మండలంలో ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నట్టు తహసీల్దార్, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జె.ఎ.సూర్యానారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం ‘సాక్షి’తో మాట్లాడారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 25 గ్రామ సచివాలయాలు ఉన్నాయని, 78,427 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వీరిలో 39,060 మంది పురుషులు, 39,367 మంది మహిళా ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. 90 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు ఐదుగురు అసిస్టెంట్లు ఉంటారని తెలిపారు. 16 సమస్యాత్మక గ్రామాలున్నాయని, ఈ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 24 గ్రామాలను 9 రూట్లుగా విభజించినట్టు తెలిపారు. ఒక్కో రూటులో పోలింగ్ కేంద్రాలను ఒక సెక్టోరియల్ అధికారి, రూట్ ఆఫీసర్, పోలీసు ఆఫీసర్ పరిశీలిస్తారని, మండలంలో సి.విజయలక్ష్మి, ఎం.సత్యకిరణ్, టి.ప్రేమ్ సాగర్‌ల ఆధ్వర్యంలో మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షిస్తాయని చెప్పారు. పోలీసు అధికారులు తాండవ చక్కెర కర్మాగారం వద్ద పోలీసు చెక్ పోస్టును ఏర్పాటు చేశారని చెప్పారు. తాను అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్టు తహసీల్దార్ సూర్యనారాయణ తెలిపారు.

30 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక



కొత్తపేట రెల్లికాలనీ చెందిన వారితో సర్పంచ్ అరుణలత, జగన్

రాంబిల్లి: కొత్తపేట రెల్లికాలనీకి చెందిన 30 మంది శుక్రవారం రాత్రి సర్పంచ్ వానపల్లి అరుణలత, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి వానపల్లి జగన్నాథరావు(జగన్) సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరంతా జనసేన పార్టీకి చెందిన వారని జగన్నాథరావు తెలిపారు. పార్టీలోకి చేరిన వారిలో కశింకోట లక్ష్మి, జోగమ్మ, దేముడు, బంగారు అప్పారావు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పుచ్చా బాబూరావు, తేలు ఈశ్వరావు, ధర్మాల శ్రీను, రమణబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



కోటవురట్ల కేకేబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



యలమంచిలిలో ఏసుక్రీస్తు వేషధారణలో శిలువను మోస్తున్న భక్తుడు



వాడనర్సాపురం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



అప్పన్నపాలెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

యలమంచిలి: మన్సిపాలిటీ,మండల వ్యాప్తంగా ఉన్న అన్ని చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌సీఎం కేథలిక్ చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తును యూదులు శిలువ వేసే ఘట్టాలను ప్రదర్శించారు. ఏసుక్రీస్తును శిలువ వేసే సమయంలో ఏవిధంగా కష్టాలు అనుభవించారో 14 భాగాలుగా విభజించి యలమంచిలి ప్రధాన రహదారిపై శుక్రవారం ప్రదర్శించారు. భక్తులు క్రీస్తు గీతాలు ఆలపిస్తుండగా సెయింట్ మేరీస్ స్కూల్ వరకు ఈ ప్రదర్శన సాగింది. సెయింట్ మేరీ స్కూల్‌లో ఏసు క్రీస్తును శిలువ వేసే దృశ్యాలను ప్రదర్శించారు. ఏసుక్రీస్తుగా ఎస్.మోహన్, పిలాతుగా జి.అర్లిప్ప,వివిధ పాత్రలను భక్తులు పోషించారు.ఈ కార్యక్రమంలో ఫాదర్ లూకాస్,నాయుడు,సెయింట్ మేరీస్ కరస్పాండెంట్ సిస్టర్ కృపా తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: మండలంలోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. స్థానిక మెయిన్‌రోడ్డు వద్ద చర్చిలో ఏసు గీతాలను ఆలపించారు.

కోటవురట్ల: గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి, బేతస్దా ప్రార్థనా మందిరాలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అప్పన్నపాలెం, వాడనర్సాపురం గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రీస్తు పలికిన ఏడు మాటలను పాస్టర్లు వివరించారు. క్రీస్తు బోధనలు ఆచరణీయమని పాస్టర్లు జేమ్స్, కాలేబు అన్నారు. దిమిలి, నారాయణపురం, పంచదార్ల తదితర గ్రామాల్లోనూ శుభ శుక్రవారం ప్రార్థనలు జరిగాయి.

వేడుకగా నూకాంబిక పుట్టుక ఉత్సవం



అమ్మవారి పాదాలు, గరగలను రిక్షాపై ఊరేగిస్తున్న దృశ్యం



భక్తుల పూజలందుకున్న అమ్మవారి పాదాలు, గరగలు

కశింకోట: స్థానికంగా ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మవారి పుట్టుక ఉత్సవం గురువారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. కొత్త అమావాస్య ఉత్సవాలకు అంకురార్పణగా ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం నుంచి పాదాలు, గరగలను అందంగా అలంకరించిన రిక్షాపై నిలిపి డప్పులు, వాయిద్యాలతో గ్రామ ప్రధాన వీధుల్లో రాత్రి అంతా ఊరేగించారు. ప్రజలు దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం పాదాలు, గరగను అమ్మవారి ఆలయంలో నిలిపారు. ఉత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివగణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు వేగి రమణబాబు, వేగి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలోనూ శారదా నదిలో నీరు



దిమిలి వద్ద శారద నదిలో ప్రవహిస్తున్న నీరు

రాంబిల్లి: వేసవికాలంలోనూ శారదా నదిలో నీరు ప్రవహిస్తోంది. రబీ వరి పంట నూర్పులు ఇప్పటికే పలుచోట్ల పూర్తయ్యాయి. అక్కడక్కడ మరో వారం రోజుల్లో కోతలు, నూర్పులు పూర్తి కానున్నాయి. శారదా నదిలో నీరు ప్రవహించడంతో ఈ ఏడాది రబీ వరి సాగుకు ఇబ్బందులు తప్పాయి. వేసవి కాలంలోనూ నీరు ప్రవహిస్తుండడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలను పొలాల్లో మేతకు తరలించినప్పుడు వాటికి తాగునీరు అందించేందుకు, వాటిని కడిగేందుకు శారదా నదిలో నీరు ఉపయోగపడుతుందని పాడి రైతులు తెలిపారు.

ఉపాధి నిధులతో తాండవ కాలువల్లో పూడిక తీత

రూ.1.55 కోట్లతో 20 కిలోమీటర్ల పనులు



తాండవ ప్రధాన కాలువులో పేరుకుపోయిన పూడిక

నాతవరం: ఉపాధి హామీ పథకంలో తాండవ కాలువలో పూడిక తీత పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కలెక్టరు ఆదేశాలతో ఈ ఏడాది తాండవ ప్రాజెక్టు పరిధిలో ఉన్న పెద్ద, చిన్న కాలువల్లో పూడిక తొలగించేందుకు ఇరిగేషన్, ఉపాధి హామీ పథకం అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. వచ్చే నెల మొదటి వారంలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వేసవిలోనే ఏటా తాండవ కాలువల్లో పూడిక తీత పనులు నిర్వహిస్తారు. గతంలో పూడిక తీసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించేది. యంత్రాలతో అధికంగా పనులు చేసేవారు. యంత్రాలతో పనులు చేయడం వల్ల కాలువలో సిమెంట్ లైనింగ్ దెబ్బతింటోంది. అందువల్ల ఉపాధి హామీ పథకం కూలీలతో పనులు చేయాలని కలెక్టర్ నిర్ణయించారు. నాతవరం మండలంలో సుమారు 20 కిలో మీటర్ల పొడవున గల పెద్ద, చిన్న కాలువల్లో రూ. 1,55,87,557 వ్యయంతో చేపట్టే పూడిక తీసే పనుల ప్రతిపాదనలను కలెక్టరు ఆమోదించారు. తాండవ రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీరు ప్రవహించేందుకు నాతవరం, కోటనందూరు, పాయకరావుపేట, కోటవురట్ల, నర్సీపట్నం, తుని, రవతలపూడి శంకవరం మండలాలు పరిధిలో సుమారు 120 కిలో మీటర్ల పొడవున కాలువలున్నాయి. ముందుగా నాతవరం మండలంలోని కాలువల్లో పూడిక తీత పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవిషయంపై తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధను సంప్రదించగా వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీరు అందించేందుకు వీలుగా వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తామన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



భర్త భాస్కరరావు, పిల్లలతో వలంటీర్ లక్ష్మి(ఫైల్)

పరవాడ: కారు ప్రమాదంలో మరణించిన ఈ.బోనంగి గ్రామానికి చెందిన ఈత భాస్కరరావు కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారం అందజేశారు. వైఎస్సార్ బీమా పథకంలో ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసిందని మృతుడి భార్య గ్రామ వలంటీర్ ఈత లక్ష్మి(నవీన) శుక్రవారం తెలిపింది. తన భర్త భాస్కరరావు జనవరిలో రాజమహేంద్రవరం నుంచి కారులో వస్తుండగా జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారని చెప్పింది. తనకు ఇద్దరు కుమారులు, అత్త ఉన్నారని, వలంటీర్‌గా పనిచేస్తూ ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్నట్లు వెల్లడించింది. గ్రామంలో గృహసారథిగా పనిచేస్తున్న తన భర్త భాస్కరరావు కారు ప్రమాదంలో మరణించగా.. వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసి నేరుగా తన బ్యాంక్ అకౌంట్‌లో జమచేసిందని లక్ష్మి చెప్పింది. బీమా పరిహారం అందించి తన కుటుంబానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. బీమా సౌకర్యం కల్పించడానికి దోహదపడిన రాష్ట్ర జేసీఎస్ కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

కశింకోట: మండలంలోని అచ్చెర్లలో 9 మద్యం సీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. ఎస్.మల్లేశ్వరి అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుందన్న సమాచారం మేరకు దాడి చేసి, పట్టుకున్నామన్నారు. ఆమెను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

13 మంది జూదరుల అరెస్ట్

వారి నుంచి రూ.37,130 స్వాధీనం

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల శివార్లలో గుళ్లాట, పేకాట, ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్న స్థావరాలపై దాడులు చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.37,130 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వివరాలు.. మల్లునాయుడుపాలెం శివారు ప్రాంతాల్లో లూడో ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నట్టు సమాచారం అందడంతో గురువారం రాత్రి దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.13,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే అమృతపురం శివార్లలో శుక్రవారం గుళ్లాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.14 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఎ.శిరసపల్లి శివారులో పేకాట ఆడుతున్నట్లు శుక్రవారం వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి 6గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టు చేసిన 13 మందిని అనకాపల్లి కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి -ఎస్పీ

పరవాడ: అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ శుక్రవారం దేశపాత్రునిపాలెం చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు విస్తృతం చేయాలని సిబ్బందికి సూచించారు. డబ్బు, మద్యం, నాటుసారా, గంజాయి, ఉచిత కానుకలు వంటివి అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర పోలీసు దళాలు, పోలీసులను ఎస్పీ మురళీకృష్ణ ఆదేశించారు.

గాయపడిన యువకుడు మృతి

కె.కోటపాడు : కారు ఢీకొనడంతో చౌడువాడ గ్రామానికి చెందిన ఆళ్ల నూకరాజు(35) అనే యువకుడు శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు కె.కోటపాడు పోలీసులకు మృతుని భార్య మాధవి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు. చౌడువాడ నుంచి శెరీరోడ్డులో నడుచుకుంటూ పొలానికి వెళ్తున్న నూకరాజును వెనుక నుంచి వచ్చిన కారు గురువారం బలంగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన నూకరాజును కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నూకరాజు ఆరోగ్య పరిస్థితి మరింత విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో జనసేన యువత చేరిక



ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన యువకులు

కశింకోట: తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మరింత కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్ కుమార్ అన్నారు. మండలంలోని ఏఎస్ పేటలోని తన నివాసంలో అనకాపల్లి మండలం సంపతిపురానికి చెందిన జనసేన యువత పవన్ కుమార్, గణేష్, శ్రీను, ఫరీద్, సాయి, ప్రదీప్, దుర్గ, రాము, మణికంఠ, యువశంకర్, నవీన్, ఈశ్వర్, కృష్ణ, ఆదర్శ్, నాగరాజు తదితర 20 మంది తమ అనుచరులతో కలిసి శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కల్లపల్లి లోవరాజు, బొడ్డపు పవన్, కల్లపల్లి ఈశ్వరరావుల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వీరికి భరత్‌కుమార్ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్‌సీపీకి అడుగడుగునా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.